ఆంధ్రజ్యోతి
ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 29.0 | కనిష్ఠం : 14.0
ANDHRAJYOTHY
5

నారాయణపేట
జిల్లా వార్తలు
మంగళవారం 17 డిసెంబరు 2024




ప్రాజెక్టులు ఘనం ■ ప్రాజెక్టులు - పరిహాసం 4

రిజర్వాయర్లు కనం

- నీటినిల్వ సామర్థ్యం లేక వినియోగంలోకి రాని ఆయకట్టు
- కల్వకుర్తి లిఫ్టు కింద 47 ఆన్‌లైన్ రిజర్వాయర్ల ప్రతిపాదన
- తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మూడు రిజర్వాయర్లతో డిజైన్
- కృష్ణా నదికి వరదలు వస్తున్నా నీటిని ఎత్తిపోయలేని దుస్థితి
- ప్రస్తుతం కల్వకుర్తి లిఫ్టు కింద 4 టీఎంసీలు మాత్రమే నిల్వ

ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగు, తాగు నీటి కోసం ప్రధానంగా ఎత్తిపోతల పథకాలను ప్రభుత్వాలు చేపట్టాయి. కానీ, వరద జలాలను ఎత్తి నిల్వ చేసుకునేందుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు సరిపడాలేవు. దీంతో జిల్లా మీదుగా వందలాది టీఎంసీల నీరు కిందికి తరలిపోతున్నా ఒడిసిపట్టుకోలేని పరిస్థితి ఉన్నది. వర్షాలు సమృద్ధిగా కురిసినా ఖరీఫ్ మినహా రబీలో సాగుచేసుకోలేని పరిస్థితి ఉన్నది. రిజర్వాయర్ల నిర్మాణం ప్రతిపాదనలు దాటి అమలుకు నోచుకుంటేనే ఇరిగేషన్ ప్రాజెక్టుల లక్ష్యం నెరవేరుతుంది. జిల్లాలో మొదటగా చేపట్టిన మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఉపయోగపడుతుంది.


నాగర్‌కర్నూల్ జిల్లా ఎల్లూరు వద్ద నిర్మాణంలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు పనులు

నిర్మాణంలో ఉన్న పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులోని కర్వెన రిజర్వాయర్

మహబూబ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఉమ్మడి పాలమూరు జిల్లాలో రెండు ప్రధాన నదులు ప్రవహిస్తున్నా గ్రావిటీ ద్వారా ప్రాజెక్టులు నిర్మించుకోలేని పరిస్థితి. అందుకే ప్రభుత్వాలు ఇక్కడ ఎత్తిపోతల పథకాలకు డిజైన్ చేస్తున్నాయి. 2004లో చేపట్టిన జలయజ్ఞంలో అప్పటి ప్రభుత్వం కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ఎత్తిపోతల పథకాలను చేపట్టింది. కొన్ని ఎత్తిపోతలకు నికర జలాల కేటాయింపులు ఉండగా మరికొన్నింటికి వరద జలాలను కేటాయించారు. గతేడాది మినహా ప్రతీఏట కృష్ణానదికి సమృద్ధిగా వరదలు వస్తున్నాయి. కానీ, కేటాయింపుల మేర నీటిని వినియోగించుకోలేని దుస్థితి

(మిగతా 6లో..)


డీఎంహెచ్‌వో కార్యాలయంలో హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

సిబ్బంది ఎక్కడ?

కార్యాలయాలను తనిఖీ చేసిన నారాయణపేట కలెక్టర్

కుర్చీలు ఖాళీగా ఉండటంతో ఆరా

నారాయణపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లా కేంద్రంలోని డీఎంఅండ్‌హెచ్‌వో, డీఆర్‌డీవో కార్యాలయాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం తనిఖీ చేశారు. డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో లేకపోవడంపై సిబ్బందిని ప్రశ్నించారు. మక్తల్ నియోజకవర్గంలోని కర్ని గ్రామానికి విజిట్‌కు వెళ్లినట్లు తెలిపారు. కార్యాలయంలో అందుబాటులో ఉన్న సిబ్బంది హాజరును కలెక్టర్ పరిశీలించారు. అనంతరం డీఆర్‌డీవో కార్యాలయానికి వెళ్లారు. అక్కడా డీఆర్‌డీవో, అదనపు డీఆర్‌డీవో గదులతో పాటు చాలా కుర్చీలు ఖాళీగా ఉండటంపై ప్రశ్నించారు. గ్రూప్-2 పరీక్షలకు వెళ్లారని చెప్పగా, అందరూ పరీక్షకు వెళ్లారా? అని ఫైర్ అయ్యారు. ఎవరెవరూ ఏయే పనులు చేస్తున్నారని అడిగారు.

నేరస్థులపై నిఘా ఉంచాలి

మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

జడ్చర్ల పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీ 6

ఉదయపు నడకతో ఉత్సాహం.. ఆరోగ్యం

ఆరోగ్య పరిరక్షణకు పెరిగిన ప్రాధాన్యం

క్రమం తప్పకుండా వాకింగ్, వ్యాయామం, యోగా

వాకింగ్‌కు రాకపోతే ఫైన్లు

ఆ డబ్బుతో ఆర్థిక సాయం 7

హంస బియ్యం ధరలు పైపైకి..

- క్వింటాల్‌కు రూ.5,500 ● సోన ధర రూ.4,500
- సీజన్‌లోనూ తగ్గని రేట్లు ● దిగుబడి తగ్గడమే కారణం

నారాయణపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో హంస బియ్యం ధరలు ధడపుట్టిస్తున్నాయి. జిల్లా రైతాంగం వరిలో ఆర్‌ఎన్‌ఆర్, బీపీటీ సన్న రకం సాగుపై ఆసక్తి చూపారు. హంస రకం సాగు తగ్గించారు. దాంతో హంస బియ్యానికి డిమాండ్ నెలకొంది. సిజన్‌లో కూడా ధరలు ఆశించిన మేర తగ్గకపోగా పెరగడం గమనార్హం. దాంతో వినియోగదారులకు ఆర్థిక భారం తప్పడం లేదు. పక్షం రోజులుగా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యాయి. ఆరంభంలో కొత్త సోన బియ్యం క్వింటాల్ ధర రూ.4,500 ఉండగా, ప్రస్తుతం రూ.4,900గా ఉంది. హంస బియ్యం కొత్తవి ఆరంభంలో క్వింటాల్ ధర రూ.5,000 ఉండగా, ప్రస్తుతం రూ.5,500గా ఉంది. సోన బియ్యం ధర క్వింటాల్‌పై రూ.400, హంసలకు రూ.500 పెరిగింది. అదే పాత సోన బియ్యం ధర క్వింటాల్ రూ.5,600 ఉండగా, పాత హంస బియ్యం ధర రూ.6,000 వరకు ఉంది. ఆర్‌ఎన్‌ఆర్ సోన రకం బియ్యం రూ.4,200 నుంచి రూ.4,500, బీపీటీ సోన రకం రూ.4,600 నుంచి రూ.5,000 ధరలు ఉన్నాయి. గత ఏడాది సోన బియ్యం ధర క్వింటాల్‌కు రూ.4,500 నుంచి రూ.5,000 వరకు ఉండగా, హంస బియ్యం రూ.4,300 నుంచి రూ.4,500 వరకు ధరలు ఉన్నాయి. ఈసారి హంస బియ్యం ధరలు అధికంగా ఉన్నాయి. బహిరంగ మార్కెట్‌లో ధాన్యానికి అధిక ధరలు ఉండటంతో బియ్యం ధరలు కూడా పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఆరు బాయిల్డ్ రైస్ మిల్లులు, 54 రా రైస్ మిల్లులు ఉన్నాయి. రాబోవు రోజుల్లో బియ్యం ధరలు ఇంకా పెరిగే అవకాశాలు లేకపోలేదని వ్యాపారులు చెబుతున్నారు.



60 శాతం దిగుబడి తగ్గింది

హంస బియ్యం క్వింటాల్ ధర రూ.5000గా ఉంది. గత ఏడాది రూ.4,400లకు విక్రయించాం. దిగుబడి అధికంగా వస్తుందని రైతులు 1010 రకం వరిని పండిస్తున్నారు. హంసల సాగు 60 శాతం తగ్గింది. దిగుబడి తగ్గడంతో ఆ బియ్యానికి డిమాండ్ పెరిగింది. ఆర్‌ఎన్‌ఆర్ బియ్యం క్వింటాల్‌కు రూ.4,200 ధర ఉండగా, బీపీటీ సోన క్వింటాల్ ధర రూ.4800గా ఉంది.

- సంతోష్, ధనలక్ష్మి రైస్ మిల్, కోస్గి


విక్రయానికి ఉంచిన హంస, సోన బియ్యం


బాక్సింగ్ పోటీల్లో తలపడుతున్న బాలికలు, చిత్రంలో కలెక్టర్ విజయేందిర బోయి, మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్

ప్రతిభను వెలికి తీసేందుకే.. సీఎం కప్ పోటీలు

రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలవాలి: కలెక్టర్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబర్ 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలికి తీసేందుకే రాష్ట్ర ప్రభుత్వం సీఎం కప్ క్రీడా పోటీలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందని మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్రబోయి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో జిల్లా స్థాయి పోటీలను మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. జిల్లా స్థాయిలో విజేతలుగా నిలిచి, రాష్ట్ర స్థాయిలో సత్తాచాటాలన్నారు. ఈ నెల 19 వరకు జిల్లా, 20న ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్, వాలీబాల్ పోటీలను జిల్లాలో నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్ మాట్లాడారు. మొదటి రోజు వెయ్యి మందికి పైగా క్రీడాకారులు హాజరైయ్యారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహరెడ్డి, డీవైఎస్‌వో శ్రీనివాస్, మునిసిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, టీజీపీడీ, పీఈటీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూరమర్ల నిరంజన్, జిల్లా ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి కురుమూర్తిగౌడ్, బాస్కెట్‌బాల్ సంఘం అధ్యక్షుడు జాకీర్‌అడ్వకేట్, ఎస్‌జీఎఫ్ అండర్-17 సెక్రటరీ శారదాబాయి పాల్గొన్నారు.

హోరాహోరీ పోరు

మొదటి రోజు కబడ్డీ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ అర్బన్, సీసీకుంట జట్లు ఫైనల్‌కు చేరాయి. బాలికల విభాగంలో బాలానగర్, మహబూబ్‌నగర్ అర్బన్ జట్లు, ఖోఖో బాలుర విభాగంలో హన్వాడ, నవాబ్‌పేట, బాలికల విభాగంలో అడ్డాకుల, బాలానగర్, వాలీబాల్ బాలుర విభాగంలో బాలానగర్, మహ్మదాబాద్, బాలికల విభాగంలో బాలానగర్, కోయిలకొండ జట్లు ఫైనల్‌కు చేరాయి. 19న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ ఎంపికలు నిర్వహించారు.

విజేతలు వీరే

నెట్‌బాల్‌లో: నెట్‌బాల్ బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండలం విజేతగా, బాలానగర్ రన్నర్‌గా నిలిచింది. బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ అర్బన్ మండలం విజేతగా, మహబూబ్‌నగర్ రూరల్ మండలం రన్నర్‌గా నిలిచాయి.

కిక్ బాక్సింగ్‌లో: కిక్ బాక్సింగ్ బాలుర వివిధ విభాగాల్లో వరుణ్‌చంద్‌నాయక్, యశన్న, విశాల్, నిఖిల్‌రెడ్డి, విఘ్నేష్, రాఘవహర్షిత్‌రెడ్డి విజేతలుగా నిలువగా, బాలికల విభాగంలో తానుజ, అద్విత, త్రిపురయాదవ్, అబిద సనా, సాన్విత గెలుపొందారు.

అక్కడికక్కడే గుర్తింపు

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తుదారుల సర్వే
- ప్రజాపాలనలో అర్జీలు పెట్టుకున్న వారి వివరాల సేకరణ
- అనర్హులను ఆన్‌లైన్ చేయకుండా తిరస్కరణ
- మొదటి విడతలో సొంత స్థలాలు ఉన్న వారికి అవకాశం
- 15 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం
- దరఖాస్తుదారులు ఎక్కువ మంది ఉంటే అదనపు సిబ్బంది కేటాయింపు


పాలమూరు పురపాలికలో సర్వే చేస్తున్న అధికారులు

మహబూబ్‌నగర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల కోసం లబ్ధిదారులు దరఖాస్తులు పట్టుకుని అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. రాజకీయ నాయకులతో పైరవీలు లేకుండానే ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులను అక్కడికక్కడే గుర్తిస్తున్నారు. అనర్హులుంటే వారి పేర్లను తొలగిస్తున్నారు. ప్రస్తుతం ఉమ్మడి పాలమూరులో అధికార యంత్రాంగం రెండు మూడ్రోజులుగా లబ్ధిదారులను ఎంపిక చేసే పనిలో నిమగ్నమైంది. ఇందిరమ్మ యాప్ ద్వారా ప్రభుత్వం సర్వే చేయిస్తోంది. ఇందుకోసం ప్రతి ఊరికి ఒక అధికారిని నియమించారు. మేజర్ పంచాయతీలలో 500 కన్నా ఎక్కువ దరఖాస్తులుంటే ఇద్దరిని నియమిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆరు గ్యారెంటీలపై ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అందులో ఇందిరమ్మ ఇళ్ల కోసం

(మిగతా 6లో..)

ముగిసిన గ్రూప్ 2 పరీక్ష

- తగ్గిన హాజరు శాతం
- పేటలో 13 సెంటర్లలో కొనసాగిన పరీక్షలు
- కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్, డీఎస్పీ


నారాయణపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా సోమవారం రెండో రోజు గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. 13 కేంద్రాల్లో జరిగిన పరీక్షల్లో ఉదయం 3994 అభ్యర్థులకు గాను 2015 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షల్లో 3994 మందికి గాను 2016 మంది అభ్యర్థులు పరీక్షలు రాశారు. 1979 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 50.48 శాతం అభ్యర్థులు పరీక్షలకు హాజరు కాగా 1978 మంది గైర్హాజరయ్యారు. హాజరు శాతం 50.48కి తగ్గింది. కలెక్టర్ సిక్తా పట్నాయక్, డీఎస్పీ లింగయ్యలు పరీక్షా కేంద్రాలను పరిశీలించి, పర్యవేక్షించారు. పరీక్షా పత్రాలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సిబ్బందికి డీఎస్పీ సూచించారు. ఉదయం ఆలస్యంగా వచ్చిన ఐదుగురు అభ్యర్థులు పరీక్షలు రాయలేకపోయారు. పరీక్షల కోసం పేట ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య ఆధ్వర్యంలో ఆరు ప్రత్యేక బస్సులు ఉదయం, సాయంత్రం వేళల్లో నడిపారు. మరికల్ నుంచి రెండు, మద్దూర్ నుంచి రెండు, మక్తల్ నుంచి రెండు బస్సులు నడిపారు.


నారాయణపేట మార్కెట్ యార్డు వద్ద ఆందోళన చేస్తున్న రైతులను శాంతింపజేస్తున్న మార్కెట్ అధికారులు, పోలీసులు

తగ్గిన ధరలతో కదం తొక్కిన కంది రైతులు

నారాయణ పేట మార్కెట్ యార్డు ముందు ధర్నా

క్వింటాల్‌కు రెండు వేలు తగ్గిస్తే ఎలా అని ఆగ్రహం

మార్కెట్ కార్యాలయంలో కుర్చీలు ధ్వంసం

రైతు సంఘాల నాయకులతో కొనసాగిన చర్చలు 6

పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగి హక్కు

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్


నేడు పెన్షన్‌దారుల దినోత్సవం 7


ఉట్టి కొడుతున్న యువకులు

ఘనంగా పాల ఉట్లు

మక్తల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పడమటి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం వేలాది భక్తుల మధ్య పాల ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు స్వామి వారికి హంసవాహన సేవ నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి మార్కండేయ ఆలయం వరకు స్వామివారికి పల్లకీ సేవ చేశారు. అక్కడి నుంచి రాంలీలా మైదానం వద్దకు చేరుకొని పాల ఉట్ల స్తంభం చుట్టు ప్రదక్షిణలు చేయించారు. అనంతరం ఉట్లు కొట్టే కార్యక్రమాన్ని ప్రారంభించారు. భక్తుల కేరింతల మధ్య యువకులు ఉట్లు కొట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ప్రాణేషాచారి, ఈవో శ్యామ్‌సుందర్‌చారి, అర్చకులు అరవిందాచారి, సీఐ చంద్రశేఖర్, ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి, వివిధ శాఖల అధికారులు, పార్టీలు, సంఘాల నాయకులు పాల్గొన్నారు.


నిర్మాణంలో ఉన్న గణపసముద్రం రిజర్వాయర్


రంగ సముద్రం రిజర్వాయర్

ప్రాజెక్టులు ఘనం.. రిజర్వాయర్లు కనం

ప్రాజెక్టులు - పరిహాసం 4


వనపర్తి జిల్లా బుద్దారం గండి చెక్‌డ్యాం

(మొదటి పేజీ తరువాయి)

ఈ రోజుకూ ఉన్నది. ఎత్తిపోతల పథకాల నిర్మాణం చేపట్టినప్పుడు ప్రతిపాదించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు నిర్మించకపోవడం, ఉన్నా సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల ఆయకట్టు ఎక్కువగా ఉన్నా ఒక్క పంటకు కూడా చివరి వరకు నీరిచ్చుకోలేని పరిస్థితి ఎదురవుతోంది. రబీ సీజన్‌లో అయితే స్టోరేజీ పూర్తిగా ఉండటం లేదు. ఆయకట్టు ప్రత్యేకంగా స్థిరీకరించకపోవడంతో ఇప్పటికీ గొలుసుకట్టు చెరువులు, వాగులు, వంకలపైనే ఆధారపడాల్సిన వస్తోంది.

కల్వకుర్తి కింద 47 రిజర్వాయర్ల ప్రతిపాదన

కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కింద ప్రస్తుతం నాలుగు రిజర్వాయర్లు ఉన్నాయి. అందులో ఎల్లూరు 0.35 టీఎంసీ, సింగోటం 0.55 టీఎంసీ, జొన్నలబొగుడ 2.14 టీఎంసీలు, గుడిపల్లిగట్టు 0.96 టీఎంసీ నిల్వ సామర్థ్యం ఉన్నది. కృష్ణానదికి సాధారణ వరద రోజులు 60 కాగా, ఒక్కోసారి ఎక్కువ కూడా నమోదు కావొచ్చు. మొత్తం 4 టీఎంసీల సామర్థ్యంతో కేటాయించుకున్న 40 టీఎంసీలను ఎత్తిపోయడానికి వాటిని సమర్థవంతంగా వినియోగించుకోవడానికి వీలు కావడం లేదు. కల్వకుర్తి కింద ప్రస్తుతం 3 లక్షల ఎకరాలు మాత్రమే సాగవుతోంది. అయితే ఈ ఎత్తిపోతల కింద నీటి సామర్థ్యం తక్కువగా ఉండటంతో ఇక్కడ 47 అదనపు రిజర్వాయర్లను నిర్మించాలని ప్రతిపాదించారు. అయితే కొత్త రిజర్వాయర్లు నిర్మించాలంటే భూ సేకరణ, అధిక ఆర్థికభారం కానున్న నేపథ్యంలో ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీల వెంట ఉన్న ఆన్‌లైన్ చెరువులను రిజర్వాయర్లుగా మార్చాలని నిర్ణయించారు. వీటిపై సర్వే నిర్వహించిన అధికారులు 10 రిర్వాయర్లు నిర్మించవచ్చని నిర్ణయించారు. వాటిలో మొత్తం 20 టీఎంసీల వరకు నీటిని నిల్వ చేసుకోవచ్చని నివేదిక సమర్పించగా ఇప్పటివరకు వాటి ప్రతిపాదనలు కలగానే ఉన్నాయి. వనపర్తి జిల్లాలోని బుద్దారం చెరువు, ఖిల్లాఘణపురంలోని గణపసముద్రాలను మాత్రమే రిజర్వాయర్లుగా మార్చే పనులు నడుస్తున్నాయి. వీటికోసం దాదాపు రూ. 87 కోట్లు ఖర్చు చేస్తున్నారు.

తుమ్మిళ్ల కింద ఊసే లేదు..

తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి రూ. 1197.77 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు రూ. 629.26 కోట్లు ఖర్చు చేశారు. ఇందులో కేవలం సుంకేసుల బ్యాక్ వాటర్ నుంచి అప్రోచ్ కెనాల్ తీసుకొని పంప్‌హౌజ్ నిర్మించి అక్కడి నుంచి నీటిని లిఫ్టు చేసి ఆర్డీఎస్ కాలువలో డీ 23 వద్ద వదులుతున్నారు. అయితే ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలిపినప్పుడు ప్రధానంగా ఆర్డీఎస్‌కు ప్రత్యామ్నాయంగా చూపారు. కేవలం వానాకాలంలోనే కాకుండా యాసంగిలోనూ పంటలకు నీరిచ్చేందుకు ప్రతిపాదించారు. కానీ, కేవలం అప్రోచ్ కెనాల్, పంప్‌హౌజ్, డెలివరీ సిస్టర్న్ మినహా అతి ప్రధానమైన రిజర్వాయర్ల నిర్మాణాన్ని వదిలేశారు. మొత్తం 57,500 ఎకరాలకు నీరవ్వాడానికి ఉద్దేశించినా ఇప్పటివరకు సగం ఆయకట్టుకు కూడా ఇవ్వడం లేదు. ఏపీ వైపు పల్లం ఉండటంతో వరద వచ్చినప్పుడు ఎత్తిపోసుకోలేక ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పథకానికి అనుసంధానంగా 1.03 టీఎంసీల సామర్థ్యంతో మల్లమ్మకుంట రిజర్వాయర్, 1 టీఎంసీ సామర్థ్యంతో జూలకల్ రిజర్వాయర్, 1.02 టీఎంసీలతో వల్లూరు రిజర్వాయర్లు నిర్మించాల్సి ఉన్నా ఇప్పటివరకు పట్టింపు లేదు. 2023లో ఎన్నికల ముందు అప్పటి ఎమ్మెల్యే వీఎం అబ్రహాం మల్లమ్మకుంట రిజర్వాయర్ నిర్మాణానికి జీఓ తెచ్చినా ఇప్పటివరకు అమలు కావడం లేదు. ఇప్పుడు ఆ తుమ్మిళ్ల ఎత్తిపోతల నిర్వహణ తీరు కూడా అస్తవ్యస్తంగా మారింది.

గంగాపురం బ్రహ్మోత్సవాలకు వేలం

జడ్చర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం ఆలయ ఆవరణలో వివిధ విక్రయాలపై వేలం పాట నిర్వహించారు. లడ్డూ, పులిహోర ప్రసాదం విక్ర యానికి రూ.27,86 లక్షలకు వెంకటయ్య, తలనీలాల సేక రణకు రూ.16,40,116 కు మ హిపాల్‌రెడ్డి దక్కించుకున్నా రు. అలాగే కొబ్బరి చిప్పలు సేకరించుకునేందుకు


వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

రూ. 2.15 లక్షలకు గౌరీశంకర్, కొ బ్బరికాయల విక్రయాలకు రూ.6,01,116కు కార్తీక్‌కు ద క్కించుకున్నారు. వివిధ రకా ల టెండర్‌ల ద్వారా రూ. 52,42,241 ఆదాయం సమకూరినట్లు, గత సంవత్సరం కంటే రూ.8,21,241 అదనపు ఆదాయం లభించిందని ఆలయ ఈవో దీప్తిరెడ్డి తెలిపారు. ఆలయ ధర్మకర్త, ఆలయ ట్రస్టీ సభ్యులు జనా ర్దన్‌రెడ్డి, గోపాల్‌యాదవ్ పాల్గొన్నారు.

అక్కడికక్కడే గుర్తింపు

(మొదటి పేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకున్న వారిని సర్వే చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకోసం దాదాపు 8.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం చేస్తున్న సర్వేలో అనర్హులను అక్కడికక్కడే స్క్రూట్నీ చేయనుండటంతో సగానికిపైగా దరఖాస్తులు తిరస్కరించే అవకాశం ఉంది. అప్పటికి ప్రభుత్వం ఎవరెవరు దరఖాస్తు చేసుకోవాలో మార్గదర్శకాలేవీ జారీ చేయకపోవడంతో ఆప్షన్ ఉంది కదా అని ఇతర వాటికి దరఖాస్తు చేసుకున్న వాళ్లంతా ఇళ్ళకోసం టిక్ కొట్టారు. అందులో చాలామంది సొంత స్థలాలు లేకున్నా, గతంలో ఈ పథకంలో లబ్ధి పొందిన వాళ్లు, ఐదు ఎకరాలకన్నా అధికంగా భూమి ఉన్న వాళ్లు దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు వీరంతా జాబితాలోనుంచి తొలగిపోనున్నారు.


పాలమూరు పురపాలికలో సర్వే చేస్తున్న అధికారులు

ఇంటికెళ్లి వివరాల సేకరణ

ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్ల వద్దకు అధికారులు వెళ్లి సర్వే చేస్తున్నారు. ముందుగా వారు నివాసం ఉంటున్న ఇళ్ల స్టేటస్‌ను పరిశీలిస్తున్నారు. ఇల్లు ఎవరి పేరిట ఉంది?, అది స్లాబ్ రకమా?.. పెంకుటిల్లా?.. మట్టిమిద్దెనా.. పరిశీలించి ఇంటి ఫొటోను తీసుకుంటారు. అద్దె ఇంట్లో ఉంటే ఆ వివరాలు తీసుకుంటారు. దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇల్లు కట్టుకోవడానికి ఖాళీ స్థలం ఉందా?, ఉంటే ఎన్ని గజాలు ఉంది?, ఆ ఇంటి డాక్యుమెంట్‌లు పరిశీలిస్తారు. ఖాళీ స్థలం వద్ద లబ్ధిదారులను నించోపెట్టి ఫొటో తీసుకుంటారు. ఒకవేళ ఇల్లు పూర్తిగా పాతబడి, కూలగొట్టి అక్కడే కడతామంటే ఆ ఇంటికి టాక్స్ కడుతున్నారా?, కరెంట్ బిల్లు ఉందా? అని చూస్తారు. ఖాళీ స్థలం లేకుండా ఇందిరమ్మ ఇంటికి అర్హులైతే వారి వివరాలు కూడా సేకరిస్తున్నారు. ఇంట్లో ప్రభుత్వ ఉద్యోగులున్నారా?, భూమి ఎంత ఉంది? అని అడుగుతున్నారు. ఐదు ఎకరాల కన్నా ఎక్కువగా ఉంటే వారిని కూడా అనర్హులుగా చేసే అవకాశం ఉంది. ఇదివరకు ప్రభుత్వం నుంచి ఇంటిని పొంది ఉంటే వారిని జాబితాలోంచి తొలగిస్తారు. మొత్తంగా ప్రభుత్వ నిబంధనల మేరకు ఉన్న వారిని లబ్ధిదారుల జాబితాలో చేర్చి, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వారి పేర్లను సర్వేలోనే తొలగిస్తున్నారు. అర్హుల అనంతరం ఆ జాబితాను కలెక్టర్‌కు అందించనున్నారు.

ఖాళీ స్థలం ఉంటే మొదటి జాబితాలో

ప్రభుత్వం మొదటి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించింది. ఈ లెక్కన ఉమ్మడి పాలమూరులోని 13 నియోజకవర్గాలకు 45,500 ఇళ్లను ఇవ్వనున్నారు. కాగ సర్వేలో అర్హులను గుర్తించిన తరువాత అందులోంచి ఇళ్లను నిర్మించుకోవడానికి సొంత స్థలాలు ఉన్నవారికి మొదటి విడతలో ప్రాధాన్యం ఇస్తారు. వాళ్ళు ఇంటి నిర్మాణం చేపడితే నాలుగు విడతల్లో రూ.ఐదు లక్షలు ఇవ్వనుంది. సొంత స్థలాలు లేని వారికి రెండో విడతలో ప్రభుత్వమే స్థలాలిచ్చి, ఇళ్ల నిర్మాణం కోసం రూ.ఐదు లక్షలు ఇవ్వనుంది. కాగా ఈ ప్రక్రియనంతా 15 రోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. చిన్న చిన్న గ్రామాలు, వార్డులు, తండాలలో నిర్ణయించిన సమయం ప్రకారం సర్వే పూర్తికానుండగా, మేజర్ పంచాయతీలలో మరింత సమయం పట్టే అవకాశం ఉంది. అక్కడ కూడా అదనపు సిబ్బందిని నియమిస్తే ఈనెలాఖరు వరకు ప్రక్రియ పూర్తకానుంది. గ్రామాలలో ప్రజలంతా ఉదయం 10 గంటలకే పొలాల వద్దకు వెళ్తుండటంతో అధికారులకు కొంత ఇబ్బంది ఉంది. అయితే దరఖాస్తుదారులకు ముందస్తుగా సమాచారం ఇచ్చి, ఇళ్ల వద్ద ఉండాలని సూచిస్తున్నారు.

పైరవీలు షురూ

ప్రభుత్వం క్షేత్ర స్థాయిలోనే లబ్ధిదారులను ఎంపిక చేయాలని చెబుతున్నా మంజూరు చేసిన ఇళ్లకన్నా అర్హుల జాబితా ఎక్కువగా ఉంది. దాంతో చివరకు అయా నియోజకవర్గాలకు కేటాయించిన ఇళ్ల మేరకు లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉండటంతో ఎమ్మెల్యేలే తుదిజాబితాను తయారు చేయాల్సి ఉంటుంది. అందుకే అయా గ్రామాలు, మండలాలకు చెందిన ముఖ్య నాయకులతో లబ్ధిదారులు మొదటివిడతలో తమ పేర్లు ఉండేలా చూడాలని పైరవీలు సాగిస్తున్నారు.

నేరస్థులపై నిఘా ఉంచాలి

మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ

జడ్చర్ల పోలీస్‌స్టేషన్ వార్షిక తనిఖీ

జడ్చర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పోలీస్ స్టేషన్‌లో కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని, ఆస్తి సంబంధిత, శారీరక నేరాల్లో పాల్గొన్న నేరస్థులపై హిస్టరీ షీట్స్ తెరిచి వారిపై నిఘా ఉంచాలని మల్టీ జోన్-2 ఐజీ సత్యనారాయణ చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జడ్చర్ల పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ జానకితో కలిసి సోమవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, విధుల గురించి తెలుసుకున్నారు. రికార్డులు, పరిశోధనలో ఉన్న సీడీ, ఇతర ఫైల్స్‌ను పరిశీలించారు. రికార్డులను ఐజీకి జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి చూయించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రెండు జాతీయ రహదారులు ఉన్నందున ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి ఉత్తమ సేవలు అందించాలన్నారు. ఫిర్యాదుదారులందరికీ ఒకే రకమైన సేవలు అందించాలన్నారు. ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకుని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. రోజూ పోలీసు అధికారులు, సిబ్బంది సమయం దొరికినప్పుడు వ్యాయామం, ధ్యానం, యోగ, వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, జడ్చర్ల ట్రైనీ ఎస్‌ఐలు, సిబ్బంది ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న ఐజీ సత్యనారాయణ

ఫేక్ సర్టిఫికెట్లు

- నకిలీ ధ్రువపత్రాలకు అడ్డాగా నల్లమల

పదర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నల్లమల ఏజెన్సీ ప్రాంతంలో అధికారులు నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి కొందరు అడ్డదారిలో ఉపాధ్యాయ, అటవీ, పోలీసు శాఖలలో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంపై 'ఆంధ్రజ్యోతి' ఆరా తీయగా ఆసక్తికరమైన అంశాలు వెలుగు చూశాయి. రాజ్యాంగంలో ఆర్టికల్ -342 ద్వారా ఏజెన్సీ యాక్ట్ 1950 జనవరి 26న అమ ల్లోకి వచ్చింది. ఏజెన్సీ సర్టిఫికెట్ ఇవ్వాలంటే నిబంధనల ప్రకారం 1950కిముందు ఆ ప్రాంతంలో పూర్వికులు నివసించి ఉండాలి. అందుకు 1954-55 భూమికి సంబంధించిన ఖాస్రా, పహనీ, ఆర్‌వోఆర్, లేదా జనన ధ్రువీకరణ పత్రం చూపించాల్సి ఉంటుంది. అవి లేనివారు ఓటరు రికార్డులో పేర్లు నమోదైనట్లు ఉండాలి. కానీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకే సంబంధం లేని వ్యక్తులు కొంత మంది దళారుల సహకారంతో స్థానిక రెవెన్యూ అధికారులకు ముడుపులు అందించి ఏజెన్సీ సర్టిఫికెట్లు పొందినట్లు తెలుస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలంలో ఓ ఉపాధ్యాయుడిపై తీవ్ర ఆరోపణలు రావడంతో 'ఆంధ్రజ్యోతి' కేస్ స్టడీ చేసింది. నల్గొండ జిల్లా చందపేట మండలంలోని పుల్యానాయక్ తండాకు చెందిన ఓ ఉపాధ్యాయుడు 1993 ఆగస్టు 25న జన్మించిన వారి పూర్వికులకు ఆ తండా శివారులో సర్వే నంబరు 72లో 3ఎకరాల ఏడు గుంటల భూమి ఉండటంతో పాటు, ఇంటి నంబరు 4-43లో దాదాపు 305 చదరపు గజాల ఇంటి స్థలం ఉన్నట్లు గ్రామ పంచాయతీ రికార్డులలో అధికారిక సమాచారం ఉంది. అక్కడే రేషన్ కార్డు, ఆధార్ కార్డులు ఉన్నా వాటిలో రేషన్ కార్డు నంబరు డబ్ల్యూఏపీ144501900319 నెంబరుతో పదర మండలంలోని జ్యోతినాయక్ తండాకు 2015 జనవరి 16న మార్చినట్లు తెలుస్తోంది. 2015 ఏప్రిల్ 8న (సీఎస్‌డీ021500618542) న ల్గొండ జిల్లా చందంపేట మండలంలో ముదు దొండ్ల గ్రామం పేరిట కుల(ఎస్టీ లంబాడ-28), జనన ధ్రువీకరణ పత్రం తీసి అక్కడి అడ్రస్‌తోనే టీఆర్‌టీ నోటిఫికేషన్ 53/2017లో అక్టోబరు10న దరఖాస్తు చేసి పరీక్ష రాశారు. కానీ పదర మండలంలోని జ్యోతినాయక్ తండా నివాసులం అన్నట్లు 2016 జూలై 5న కుల, జనన ధ్రువీకరణ పత్రం (సీడీఎస్ 021605957185) తీశారు. అంతే కాకుండా తమ పూర్వికులు బోజ్యా పేరుతో వంశవృక్షం తయారు చేసి జ్యోతి నాయక్ తండాలోనే సర్వే నంబరు 227/57లో భూమిని పాస్ బుక్‌లో చూపించి ఉన్నట్లు సృష్టించారు. వాటి ఆధారంగానే రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై నకిలీ ఏజెన్సీ సర్టిఫికెట్ (నెం.సీ 895/2018) పొందారు. ఈ విషయంలో అప్పటి ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారి చేతులు తడపడంతో ఎన్‌వోసీ ఇచ్చినట్లు ఆరోపణలున్నాయి. ప్రస్తుతం ఏజెన్సీలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అంతకంటే ముందు ఇదే వ్యక్తి 2019లో ఫారెస్టు బీట్ ఆఫీసర్‌గా ఉద్యోగం పొందినట్లు తెలిసింది.

ఇదిలా ఉండగా వంకేశ్వరంలో విధులు నిర్వహిస్తున్న ఈ ఉపాధ్యాయుడు జీవో నెంబరు 317లో వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని అల్లాపూర్ గ్రామానికి బదిలీపై వెళ్లిన ఆ ఉపాధ్యాయుడు వివాహం కాకున్నా జీవిత భాగస్వామి ఉన్నట్లు స్పౌస్ ఖాతాలో పదర మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలకు రావడం గమనార్హం.

2019లో అటవీశాఖలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ పోస్టుల్లో నాన్ ఏజెన్సీ వారు ఏజెన్సీ సర్టిఫికెట్లు సంపాదించి ఉద్యోగాల్లో చెలామని అవుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి. అయితే రెవెన్యూ గ్రామమైన వంకేశ్వరంలో చిట్లంకుంట గ్రామ శివారులో సర్వే నెంబరు 95లో 1954-55లోనే తమ పూర్వీకులకు భూమి ఉన్నట్లు కొంత మంది అధికారులతో కుమ్మక్కై తప్పుడు నివేదికలిచ్చి ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇచ్చారు. అందులో నల్గొండ జిల్లా చందంపేట మండలంలోని బొల్లారం పట్టి గ్రామానికి చెందిన వారు, సంద్రగడ్డకు చెందిన మరో మహిళ అత్తగారికి సంబంధించిన పదర మండలంలోని ఓ ఏజెన్సీ గ్రామంలో వారి పూర్వికులు ఉన్నట్లు, అక్కడే ఆమే తల్లిదండ్రులు పుట్టినట్లు భూమిని కూడా చూపించడం విశేషం. అయిన అసలు 95 సర్వే నెంబరుపై అప్పట్లో ఖాస్రా, పహనీలు లేవని కేవలం 2001 ఫిబ్రవరి 4న కేవలం ఐదు ఎకరాలు మాత్రమే ప్రభుత్వ భూమి ఉందని పదర రెవెన్యూ కార్యాలయం నుంచి అధికారిక సమాచారమిచ్చారు. ఇన్ని రకాల ఆధారాలున్నా పై స్థాయి అధికారులు చర్యలు తీసుకోకపోవడం వలన ఎంతో మంది నిజమైన అభ్యర్థులు అన్యాయానికి గురవుతున్నారని ఏజెన్సీ గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అనర్హులను వెంటనే తొలగించాలి



రాష్ట్ర ప్రభుత్వం నిజనిర్ధారణ కమిటీ వేసి అనర్హులుగా ఉన్నవారిని గుర్తించి వెంటనే తొలగించాలి. అధికారుల చేతి వాటం వల్లే ఇదంతా జరుగుతోంది. గతంలో కూడా ఫిర్యాదు చేశాం. ఎవరూ స్పందించ లేదు.

- జైపాల్ నాయక్, ఏజెన్సీ గిరిజన హక్కుల పోరాట సమితి ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడు

ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు



గతంలో ఎం జరిగిందో తెలియదు. ప్రస్తుతం ఏజెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు. ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు పంపిస్తాం. అక్కడి నుంచి అదేశాలొస్తేనే సర్టిఫికెట్లు జారీ చేస్తాం.

- సురేష్ బాబు, తహసీల్దార్, పదర

నీటి విడుదలకు గ్రీన్ సిగ్నల్

ఆత్మకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : యాసంగిలో జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువల ద్వారా సాగు నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు అధికారులు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. దీంతో ఎడమ కాలువ ఆయకట్టు రైతులు యాసంగి సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ ఏడాది వర్షాలు భారీగా కురియడంతో కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్, ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు జలాశయాల్లో ఆశించిన మేర నీటి నిల్వ ఉన్న కారణంగా అధికారులు సాగునీటిని విడుదల చేసేందుకు సిద్ధమయ్యారు. వానాకాలంలో ఎడమ కాలువ కింద 80 వేల ఎకరాలకు పైగా సాగుచేశారు. రబీ సీజన్‌లో సాగు, తాగు అవసరాల నిమిత్తం తెలంగాణ జలాశయాల అధికారులు గత మంగళవారం హైదరాబాద్‌లోని జల సౌదలో స్టేట్ లెవెల్ కమిటీ, ఇరిగేషన్ వాటర్ ప్లానింగ్ మేనేజ్‌మెంట్ వారి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సాగునీటిపై స్పష్టత ఇవ్వడంతో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు అధికారులు 35వేల ఎకరాలకు సాగునీటిని అందిస్తామని ప్రాజెక్టు ఈఈ జగన్మోహన్ తెలిపారు.

కుడి ఎడమ కాలువల ద్వారా సాగునీరు

అధికారుల ఆదేశాల మేరకు ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి, ఎడమ కాలువ ద్వారా 35వేల ఎకరాలకు సాగునీటిని అందించేందుకు అవకాశాలు ఉన్నాయని ప్రాజెక్టు ఈఈ జగన్మోహన్ తెలిపారు. అలాగే ప్రతీ ఏడాది జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు ప్రాజెక్టు అధికారులు రైతులతో సమావేశం నిర్వహించాల్సి ఉంది. సమావేశం అనంతరం ఎడమ కాలువ ద్వారా డిస్ట్రిబ్యూటర్ 1 నుంచి ఎక్కడి వరకు ఇవ్వాలో స్పష్టత రానుంది. సమావేశానికి తేదీ ఖరారు కాలేదు. రామన్‌పాడు రిజర్వాయర్ వరకు సాగునీటిని అందించిన వారబంధి మాదిరిగా విడుదల చేసే అవకాశం ఉంది. 2022లో విడుదల చేసిన మాదిరిగా వారానికి నాలుగు రోజుల పాటు ఆరు తడి పంటలకు సాగు నీటిని విడుదల చేసే అవకాశం ఉంది. రైతులు పొదుపుగా వాడుకుంటే పంటలు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.


యాసంగి సాగుకు ముందస్తుగా నార్లు పోసుకున్న ఆయకట్టు రైతులు

ఇది వరకే నార్లు పోసుకున్న రైతులు

ఈ ఏడాది ఆశించిన మేర వర్షాలు కురియడంతో రైతులు యాసంగి సీజన్‌కు నీటి విడుదల చేస్తారని ముందుగానే నార్లు పోసుకున్నారు. ఎగువన నారాయణపూర్ ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో యాసంగి సీజన్ సాగు చేస్తున్న కారణంగా రోజు వారిగా ప్రాజెక్టుకు 1,000 నుంచి 1,500 క్యూసెక్కుల వరద నీరు రావడం రైతులకు ఊరటనిచ్చే అంశం. డిసెంబరు 2వ వారంలో సాగునీటి సమావేశం నిర్వహించి నీటి విడుదల అంశంపై స్పష్టత రానుంది. ఈ క్రమంలో డిసెంబరు 3వ వారం గడుస్తున్నా సాగునీటి విడుదలపై సమావేశం నిర్వహించకపోవడంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా ప్రాజెక్టు అధికారులు సత్వరమే సమావేశం నిర్వహించి సాగునీటిని విడుదల చేయాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ఈ నెలలో సమావేశం నిర్వహించే అవకాశం



తాగునీటి అవసరాల నిమిత్తం మిషన్ భగీరథ ద్వారా నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఐఏబీ సమావేశం నిర్వహించే అవకాశం ఉంది. సమావేశం అనంతరమే ఎన్ని వేల ఎకరాలకు సాగునీటిని విడుదల చేస్తామనే విషయంపై స్పష్టత రానుంది. అప్పటి వరకు రైతులు వేచి చూడాల్సిందే.

- జగన్మోహన్, జూరాల ప్రాజెక్టు ఈఈ

చెరకు ట్రాక్టర్ బోల్తా

కొత్తకోట, డిశంబరు 16 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలోని అమడబాకుల శివారులోని జాతీయ రహదారిపై సోమవారం చెరకు ట్రాక్టర్ బోల్తా పడింది. జోగుళాంబ గద్వాల జిల్లా ఉప్పేర్ నుంచి చెరకు లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్ చాకచక్యంగా ప్రాణాలతో బయట పడ్డాడు. రహదారిపై కొంతసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. హైవే పోలీసులు, షుగర్ ఫ్యాక్టరీ సిబ్బంది అక్కడికి చేరుకొని చెరకును తొలగించి ట్రాఫిక్‌ను సరి చేశారు.

సిర్సనగండ్ల ఆలయంలో త్రిదండి దేవనాథ

రామనుజ జీయర్‌స్వామి

చారకొండ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిర్సనగండ్లలోని అయోధ్యనగర్(గుట్ట)లో సీతా రామచంద్రస్వామి ఆలయాన్ని సోమవారం త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి సందర్శించారు. ఆలయ చైర్మన్ డేరం రామశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్, టీటీడీ వారి సహకారంతో మండలంలోని గోకారంలో కోదండ రామస్వామి నూతన ఆలయానికి ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో శివప్రసాద్, గోపాల్, శ్రీరాం, కల్యాణ్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన కంది రైతులు


నారాయణ పేట మార్కెట్ కార్యాలయంలో చర్చలు జరుపుతున్న రైతు సంఘాల నాయకులు

నారాయణపేట, డిసెంబరు 16 (ఆంధ్రజోతి) : నారాయణపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ధరలు తగ్గడంతో కంది రైతులు సోమవారం కదం తొక్కారు. కందులు క్వింటాల్‌కు రెండు వేల రూపాయలు తగ్గడంతో ఆగ్రహించిన రైతాంగం వ్యవసాయ మార్కెట్ యార్డులోని మార్కెట్ కార్యాల యాన్ని ముట్టడించారు. ఆక్రోశంతో కొందరు మార్కెట్ కార్యాలయంలోని రెండు కుర్చీలను ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేశారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి బుజ్జగించే ప్రయత్నం చేసినా వారు శాంతించలేదు. మార్కెట్ యార్డు ముందు బైఠాయించి మద్దతు ధర కల్పించాలని నినాదాలు చేయడంలో స్వల్ప ఉద్రిక్తత నెలకొన్నది. సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు రైతులను సముదాయించే ప్రయత్నం చేశారు. సోమవారం రికార్డు స్థాయిలో ఎర్ర కందులు 3031.14 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ. 10,756, కనిష్ఠ ధర రూ. 7,888 రమారమి ధర రూ. 8,932 పలికింది. తెల్ల కందులు 770.77 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ. 10,901, కనిష్ఠ ధర రూ. 8,555, రమారమి ధర రూ. 10,706 పలికాయి. ఐతే ఈనెల 14న ఎర్ర కందులు 1963.43 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాల్ గరిష్ఠ ధర రూ. 11,450, కనిష్ఠ ధర రూ. 8,900, రమారమి ధర రూ. 10,258 పలికింది. తెల్ల కందులు 661.50 క్వింటాళ్లు విక్రయానికి రాగా క్వింటాలుకు గరిష్ఠ ధర రూ. 11,490, కనిష్ఠ ధర రూ. 9840, రమారమి ధర రూ. 11,420 పలికాయి. ఆదివారం సెలవు కాగా సోమవారం రెండు రోజుల వ్యవధిలో ఏకంగా క్వింటాల్‌కు రెండు వేలు ఎలా తగ్గుతాయని రైతులు నిలదీశారు.

వ్యాపారులు సిండికేట్‌గా మారి ట్రేడర్లు ఆలస్యంగా వేస్తూ తమను మోసం చేస్తున్నారని ఆరోపించారు. అయితే అన్ని మార్కెట్‌లలో కంది ధరలు తగ్గాయని వ్యాపారులు చెప్పుకొచ్చారు. మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, రైతు సంఘాల నాయకులు వెంకోబా, వెంకట్రామి రెడ్డి, బాల్‌రామ్, అనంత్‌రెడ్డి, ప్రభు, గోపాల్‌యాదవ్ తదితరులు రైతులతో పాటు మార్కెట్ కార్యదర్శి భారతి, సూపర్‌వైజర్ లక్ష్మణ్‌లు రాత్రి వరకు చర్చలు జరిపారు. వ్యాపారులతో మాట్లాడి క్వింటాల్ కు పది వేలకు తగ్గ కుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వరకు చర్చలు ఓ కొలిక్కి రాలేదు. కాంటాలు మాత్రం నిలిచిపోయాయి.

బాల బ్రహ్మేశ్వర స్వామికి అన్నాభిషేకం

అలంపూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అలంపూరు పుణ్య క్షేత్రంలో వెలసిన బాలబ్రహ్మేశ్వర స్వామికి సోమవారం ధనుర్మాసాన్ని పురస్కరించుకొని అర్చకులు స్వామి వారికి అన్నాభిషేకం చేసి లింగాకారంలో అలంకరించి దశవిధ హారతులు సమర్పించారు. ఉదయం ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. పరిసర ప్రాంత భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.


అన్నాభిషేకంలో భక్తులకు దర్శనం ఇస్తున్న స్వామివారు

పెన్షన్ భిక్ష కాదు..

ఉద్యోగి హక్కు

నేడు పెన్షన్‌దారుల దినోత్సవం

- పెన్షన్‌తోనే విశ్రాంత ఉద్యోగికి ప్రశాంత జీవితం
- పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్

పాలమూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : పెన్షన్ భిక్ష కాదని, తమ హక్కు అని విశ్రాంత ఉద్యోగులు అంటున్నారు. 1982 నుంచి అమలులో ఉన్న పెన్షన్ విధానాన్ని 2004లో నిలిపివేసిన ప్రభుత్వం, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను అమలు చేస్తోంది. దీంతో రిటైర్ అయిన, కానున్న ఉద్యోగులు ఆందోళనకు గురవుతున్నారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. 24 ఏళ్ల సీనియారిటీ పూర్తి చేసిన ఉద్యోగులకు రిటైర్మెంట్ సమయంలో వచ్చే వేతనంలో సగం పెన్షన్ రూపంలో ఇస్తామని ఆరు నెలల కిందట కేంద్ర ప్రభుత్వం చెప్పింది. కానీ ఇప్పటివరకూ అమలు చేయలేదు. ఈ నెల 17న పెన్షన్‌దారుల దినోత్సవం సందర్భంగా కొందరు రిటైర్డ్ ఉద్యోగులను 'ఆంధ్రజ్యోతి' పలుకరించి అభిప్రాయాలను తెలుసుకున్నది. ఆ వివరాలు..



మహబూబ్‌నగర్ పట్టణానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగులు

నైజాం కాలం నుంచి పెన్షన్ ఇస్తున్నారు

ఎం.నరసింహులు, ప్రభుత్వ రిటైర్డ్ పెన్షన్‌దారుల సంఘం జిల్లా అధ్యక్షుడు : నైజాం కాలం నుంచి ఉద్యోగులకు పెన్షన్ ఇస్తున్నారు. కానీ కొన్ని శాఖల ఉద్యోగులకే ఇచ్చేవారు. పెన్షన్ లేకపోతే రిటైర్డ్ ఉద్యోగుల జీవనం దుర్భరంగా మారుతుంది. కనీస అవసరాలకు కూడా వెతుక్కోవాల్సి వస్తుంది.

విశ్రాంత జీవితానికి పెన్షనే ఆధారం

సాయిలు గౌడ్, రిటైర్డ్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు : ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగుల జీవితానికి పెన్షనే ఆధారం. నెలా నెలా పెన్షన్ వస్తేనే జీవితం సాఫీగా సాగుతోంది. ఇంట్లో, బయట ఒకరికి చేయి చాపకుండా బతుకుతున్నాం.

పాత విధానం అమలు చేయాలి

సనాతన బాలస్వామి, సీపీఎస్ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు : రిటైర్డ్ ఉద్యోగులు పెన్షన్ లేకపోతే ఎలా బతుకుతారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి. 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారందరికీ ప్రభుత్వం ప్రతీనెలా పెన్షన్ ఇవ్వాలి.

మా పరిస్థితి ఏంటి?

ఎ.రాజసింహుడు, ఈపీఎస్ పెన్షనర్ల జాతీయ సంఘర్షణ సమితి అధ్యక్షుడు : ఆర్టీసీ, బీహెచ్ఈఎల్ తదితర కార్పొరేషన్‌లలో పని చేసి రిటైర్ అయిన మాలాంటి వాళ్ల పరిస్థితి ఏమిటి? జీవనం ఎలా? బీపీ, షుగర్ మందులు, వైద్యం ఖర్చులు ఎలా? ఈ వయసులో ఏమి పని చేయాలి, ఎలా బతకాలి? కార్పొరేషన్ ఉద్యోగులకు కూడా పెన్షన్ అమలు చేసి ఆదుకోవాలి.



కొత్తకోట పోలీస్‌స్టేషన్ సమీపంలోని మైదానంలో వాకింగ్ చేస్తున్న వందేమాతరం వాకింగ్ క్లబ్ సభ్యులు

ఉదయపు నడకతో

ఉత్సాహం..ఆరోగ్యం

- ఆరోగ్య పరిరక్షణకు పెరిగిన ప్రాధాన్యం
- కొత్తకోటలో మార్నింగ్ వాకర్స్ క్లబ్బులు
- క్రమం తప్పకుండా వాకింగ్, వ్యాయామం, యోగా
- వాకింగ్‌కు రాకపోతే ఫైన్లు
- ఆ డబ్బుతో సభ్యుల విహార యాత్రలు
- అవసరమైన వారికి ఆర్థిక సాయం

కొత్తకోట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగం, ఉపాధి బాటలో ఉరుకులు పరుగుల జీవితాలు గడుపుతున్న జనం శారీరక శ్రమకు దూరం అవుతున్నారు. దీనికి తోడు మారిన ఆహారపు అలవాట్లు, జీవన విధానంతో అనారోగ్యం బారిన పడుతున్నారు. వ్యాధుల బారిన పడి చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లడం కన్నా, ప్రతీ రోజు ఉదయం కొంత సేపు తమకోసం తాము సమయం కేటాయించుకుంటున్నారు. 40 ఏళ్లు దాటిన వారు వాకింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. క్రమం తప్పకుండా వాకింగ్, యోగా, వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకుంటున్నారు. అలాగే మూడు నాలుగు నెలలకోసారి వైద్య పరీక్షలు చేయించుకుంటూ ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

మార్నింగ్ వాక్‌తో ఎన్నో లాభాలు

ఉదయపు నడకతో చాలా లాభాలున్నాయని వైద్యులు చెప్తున్నారు. ప్రతీ రోజు పదివేల అడుగులు నడిస్తే అనారోగ్య సమస్యలు దరిచేరవని అంటున్నారు. ప్రతీ రోజు నాలుగు వేల అడుగులు నడిస్తే ప్రాణాంతక వ్యాధుల్లో 25 శాతం మేర దూరం పెట్టొచ్చని సూచిస్తున్నారు. 2500 అడుగులు వేస్తే గుండె సమస్యల నుంచి తప్పించుకోవచ్చని చెప్తున్నారు. వెయ్యి అడుగులు వేస్తే ఆయుఃప్రమాణం 15 శాతం అధికమైతుందని అంటున్నారు.

క్రమం తప్పకుండా మైదానానికి..

కొత్తకోట పట్టణంలో 40 ఏళ్లు పైబడిన వారు గ్రూపులుగా ఏర్పడి వందేమాతరం, ఆరోగ్య, సన్‌రైజ్, జై భారత్, ఛత్రపతి పేర్లతో వాకింగ్ క్లబ్‌లు ఏర్పాటు చేసుకున్నారు. సభ్యులందరూ క్రమం తప్పకుండా మైదానానికి వచ్చేలా నియమ నిబంధనలను విధించుకున్నారు. అందుకోసం ఎంచుకున్న మైదానానికి ప్రతీ రోజు ఉదయం ఐదు నుంచి 5.50 గంటల లోగా చేరుకొని 6.40 గంటల వరకు అక్కడే ఉండాలి. ఆ సమయంలో 40 నిమిషాలు వాకింగ్, 10 నిమిషాలు విశ్రాంతి, మిగిలిన సమయంలో వామప్, వ్యాయామం, సూర్య నమస్కారాలు, యోగా చేస్తారు. ప్రతీ ఆదివారం వాకింగ్ అనంతరం ఆట విడుపుగా సరదాగా గడుపుతారు. ఇష్టమైన పాటలకు నృత్యం చేస్తారు.

కచ్చితమైన నియమ నిబంధనలు

గ్రూప్ సభ్యులు వాకింగ్‌కు రాని రోజు రూ.20 ఫైన్ కట్టాలి. అలాగే డ్రెస్ ధరించకుంటే వంద రూపాయలు చెల్లించాలి. దీంతో పాటు సభ్యులు ప్రతీ నెల రూ. 500 చొప్పున జమ చేసి చిట్టీ కట్టుతున్నారు. అలా పోగు చేసిన డబ్బుతో విహార యాత్రలకు వెళ్తున్నారు. కొత్తకోటలోని ఆరోగ్య, సన్‌రైజ్ వాకింగ్ సభ్యులు ఇటీవల బ్యాంకాక్, ఢిల్లీ, ఆంధ్రప్రదేశ్‌లోని అహోబిలం ప్రాంతాలకు వెళ్లివచ్చారు. అలాగే సభ్యులు, వారి కుటుంబ సభ్యుల్లో ఎవరైనా అనారోగ్యం బారినపడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతుంటే, వారి పరిస్థితిని బట్టి కొంత ఆర్థిక సాయం కూడా చేస్తున్నారు. సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొంటున్నారు.



యోగాసనాలు వేస్తున్న ఆరోగ్య వాకింగ్ క్లబ్ సభ్యులు

ఎనిమిదేళ్లుగా వాకింగ్ చేస్తున్నా



నేను ఎనిమిదేళ్లుగా వాకింగ్ చేస్తూ, ఆరోగ్యంగా ఉన్నాను. 50 ఏళ్ల వయస్సు దాటినా బీపీ, షుగర్ లాంటి అనారోగ్య సమస్యలు లేవు. సూర్య నమస్కారాలు, ఆటలు, నృత్యాలతో మానసికోల్లాసం కలుగుతోంది. నాతో కలిసి వచ్చిన 25 మంది సభ్యులతో గ్రూప్ ఏర్పాటు చేసుకొని, అందరితో వ్యాయామం, యోగా చేయిస్తున్నా.

- దేవన్న, ఉపాధ్యాయుడు, వందేమాతరం వాకింగ్ గ్రూప్ ట్రైనర్.

రోజంతా హుషారుగా ఉండొచ్చు



వాకింగ్, వ్యాయామం చేస్తే రోజంతా హుషారుగా ఉండొచ్చు. ఆరేళ్ల క్రితం నా మిత్రుడు ఒకరు అనారోగ్యం బారిన పడితే, ప్రతీ రోజు వాకింగ్ చేయాలని వైద్యులు చెప్పారు. ఆ సూచన మేరకు ఆరోగ్య వాకింగ్ క్లబ్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాను. ఆరోగ్య పరిరక్షణతో పాటు ఆర్థిక ఎదుగుదలకు సలహాలు, సూచనలు చేసుకుంటున్నాం.

- శేఖర్‌గౌడ్, ఉపాధ్యాయుడు, ఆరోగ్య వాకింగ్ క్లబ్ ట్రైనర్.

బరువు తగ్గి సంతోషంగా ఉన్నా..



వాకింగ్ చేయడంతో బరువు బాగా తగ్గాను. కొలెస్ట్రాల్ కూడా తగ్గింది. విద్యార్థి దశ నుంచి క్రీడాకారుడిగా బలంగా ఉన్నా, నేలపై పద్మాసనం వేసుకొని కూర్చోవడం సాధ్యం కాకపోయేది. ఇప్పుడు హాయిగా నేలపై కూర్చుని భోజనం చేస్తున్నానంటే అది వాకింగ్ పుణ్యమే. తిన్న తిండి రెండు గంటల్లోనే అరిగిపోయి మళ్లీ ఆకలి అవుతుంది.

- చంద్రశేఖర్‌రెడ్డి, వ్యాపారి.

వయసును మరిచి ఉల్లాసంగా ..



నేను 20 ఏళ్ల కిందట వైద్య పరీక్షలు చేయించుకుంటే షుగర్ అని తెలిసింది. అప్పటి నుంచి క్రమం తప్పకుండా ప్రతీ రోజు వాకింగ్ చేస్తున్నాను. ప్రస్తుతం ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేవు. ఇప్పుడు షుగర్ కూడా కంట్రోల్‌లో ఉంది. 60 ఏళ్లున్న నేను వాకింగ్ చేయడం వల్ల వయసును మరిచి ఉల్లాసంగా జీవిస్తున్నాను.

- రవీందర్‌రెడ్డి, ఉద్యోగి.

స్పోర్ట్స్ బాక్స్

రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో..

పాలమూరు ఘన విజయం

- 445 పరుగుల తేడాతో జయ కేతనం
- డబుల్ సెంచరీతో కదం తొక్కిన కేతన్‌కుమార్
- ఆరు వికెట్లు తీసి రాణించిన సోహెల్



విజయం సాధించిన మహబూబ్‌నగర్ జట్టు క్రీడాకారులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అండర్-14 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నీలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టు 445 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హైదరాబాద్‌లోని అజీజ్‌నగర్ వన్ చాంపియన్-2 స్టేడియంలో సోమవారం నిర్వహించిన మ్యాచ్‌లో మహబూబ్‌నగర్, ఎస్‌టీ అంథోని హైస్కూల్ జట్లు తలబడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన మహబూబ్‌నగర్ జట్టు 47 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 468 పరుగులు చేసింది. జట్టులో జీ. కేతన్‌కుమార్ 136 బంతుల్లో 26 ఫోర్లు, ఒక సిక్స్‌తో డబుల్ సెంచరీ (235) చేసి నాటౌట్‌గా నిలిచాడు. శ్రీహర్షిత్ 65 బంతుల్లో మూడు ఫోర్లతో అర్ధసెంచరీ (75) చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఏ. హర్షిత్ 43 బంతుల్లో ఐదు ఫోర్లతో అర్ధ సెంచరీ(62), సాయిరామ్ 32, అర్జున్ 30 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన ఎస్‌టీ అంథోని హై స్కూల్ జట్టు 11.1 ఓవర్లలో 23 పరుగులకు కుప్ప కూలింది. జిల్లా జట్టు బౌలర్లలో సోహెల్ అద్భుతమైన బౌలింగ్ చేసి ఆరు వికెట్లు, వెంకట్‌సాగర్ మూడు వికెట్లు తీసి జట్టును విజయతీరం వైపు నడిపించారు. అద్భుతమైన విజయం సాధించిన జిల్లా జట్టు క్రీడాకారులను, కోచ్ అబ్దుల్లాను జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ అభినందించారు.



డబుల్ సెంచరీ చేసిన కేతన్‌కుమార్



ఆరు వికెట్లు తీసి రాణించిన సోహెల్

రాష్ట్ర స్థాయి పోటీలకు కోయిలకొండ విద్యార్థి

కోయిలకొండ డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో త్వరలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలం, పారుపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి రవితేజ ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా శ్వేత విద్యామందిర్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్ నరేందర్‌జీ, ప్రిన్సిపాల్ నుహారా అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీలకు పాఠశాల విద్యార్థి ఎంపిక కావడంపై సంతోషం వ్యక్తం చేశారు. పోటీల్లో ప్రతిభ చాటి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.

ఫార్మా కాలుష్యంపై చర్యలు తీసుకోవాలి

- అసెంబ్లీ సమావేశాల్లో జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా వదులుతున్న కాలుష్యంపై చర్యలు తీసుకోవాలని జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్‌రెడ్డి కోరారు. శాసనసభ సమావేశాల్లో సోమవారం ఆయన ఈ విషయాన్ని ప్రస్తావించారు. కాలుష్య జలంతో రాజాపూర్ మండలంలోని ముదిరెడ్డిపల్లి చెరువుతో పాటు పంట పొలాలు దెబ్బతింటున్నాయని స్పీకర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ విషయాన్ని గత అసెంబ్లీ సమావేశాల సందర్భంగా జూలై 30న కూడా ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. అయినా కలుషిత జలాన్ని వదులుతూనే ఉన్నారని పేర్కొంటూ.. ఈ అంశంపై వివిధ దినపత్రికలలో ప్రచురితమైన పేపర్ కటింగ్‌లను స్పీకర్‌కు చూపించారు. వాటిలో ఆగస్టు 24న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కాలుష్య కోరలు కథనానికి సంబంధించిన పేపరు క్లిప్పింగు కూడా ఉంది. కాలుష్యం అంశంపై గ్రామస్థులు, రైతులు కాలుష్య నియంత్రణ మండలి (పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు)కి ఫిర్యాదు చేశారని తెలిపారు. సమస్య తీవ్రంగా ఉన్నప్పుడు రాని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, ఫార్మా కంపెనీలు కలుషిత, వ్యర్థ జలాన్ని వదలడం నిలిపి వేసిన తర్వాత, ఆనవాళ్లు లేని సమయంలో తనిఖీ చేశారన్నారు. ఫిర్యాదుపై చర్యలు తీసుకోని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలంటూ రైతులకు ఉచిత సలహా ఇచ్చారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఎమ్మెల్యే లేవనెత్తిన ప్రశ్నకు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమాధానమిస్తూ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో గతంలోనూ, ఇటీవల తనిఖీలు జరిపారన్నారు. అరబిందో ఫార్మాతో పాటు అమ్నెల్, ఏపీఎల్ హెల్త్‌కేర్ పరిశ్రమల నుంచి ఎలాంటి వ్యర్థాలు, కాలుష్యం నీరు ముదిరెడ్డిపల్లి చెరువులోకి వదలలేదని, భూసారానికి ఎలాంటి నష్టం జరగలేదని తేల్చినట్లు వెల్లడించారు. వివిధ దినపత్రికలలో వచ్చిన కథనాలను పరిశీలిస్తామని, వ్యవసాయశాఖ నుంచి నివేదికను కోరుతామని తెలిపారు. నిబంధనలను అమలు చేయడంలో ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.



అరబిందో ఫార్మా కాలుష్యంపై శాసనసభలో మాట్లాడుతున్న జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి

సభా సమయం

పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలి

- శాసనసభలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేటటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. హైదరాబాద్‌లో కొనసాగుతున్న శాసనసభ సమావేశాల్లో సోమవారం ఆయన మాట్లాడారు. అచ్చంపేట నియోజకవర్గ సమస్యలను ప్రస్తావించారు.

నల్లమల ప్రాంతంలోని గిరిజన, ఆదివాసీ గ్రామాలకు సరైన రోడ్డు మార్గాలు, రవాణా సౌకర్యం లేక అభివృద్ధికి నోచుకోవడం లేదన్నారు. రానున్న రోజుల్లో ప్రతీ ఒక్క గిరిజన, ఆదివాసీ ప్రాంతాలకు రోడ్లు వేయించనున్నట్లు తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో నల్లమల ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంతో పాటు నల్లమల ప్రాంతాలు అభివృద్ధికి కృషి కొనసాగుతోందన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

ఈశ్వర వీరప్పయ్య ఆలయంలో

అమడాల కొబ్బరికాయ



దేవరకద్ర, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండల కేంద్రంలోని ఈశ్వర వీరప్పయ్య దేవాలయంలో వింత చోటుచేసుకున్నది. అర్చకులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రత్నయ్యాచారి అనే భక్తుడు ఆలయంలో పూజలు చేసి దేవుడికి కొబ్బరికాయ కొట్టగా కొబ్బరికాయలో ఒక్కొక్క భాగంలో రెండు భాగాలుగా విభజించినట్లు ఉండటంతో అందరూ ఆశ్చర్యానికి గురయ్యారు. కొబ్బరికాయలు కొట్టినప్పుడు కుళ్ళి పోవడం, పువ్వు రావడం సాధారణంగా కనిపిస్తుంటాయి. కానీ, ఇలా ఒక్కొక్క భాగంలో కవలలుగా కనిపించడంతో ఇది అరుదు అని అర్చకులు అన్నారు. ఈ రోజు అరుద్ర నక్షత్రం సోమవారం రావడంతో మంచికే జరిగిందని నమ్ముతున్నారు. ధనుర్మాసం సందర్భంగా వాసవీమాత ఆలయంలో ఆర్యవైశ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

38 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- బొలెరో వాహనం సీజ్
- నిందితులపై కేసు నమోదు

గద్వాల క్రైం, ఆత్మకూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రాఘవేంద్రకాలనీలో ఆదివారం అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు పట్టణ ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ధరూర్ మండల కేంద్రానికి చెందిన ఎరుకలి వెంకటేశ్ జిల్లా కేంద్రంలో తక్కువ ధరకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేశాడు. మొత్తం 20 క్వింటాళ్ల బియ్యాన్ని బొలెరో వాహనంలో రాయిచూరు వైపు తీసుకెళ్తుండగా, రాఘవేంద్ర కాలనీ సమీపంలో పోలీసులు పట్టుకొని వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. వాహనాన్ని సీజ్ చేసి, రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

వనపర్తి జిల్లా ఆత్మకూరు పట్టణ పరిధిలోని ఖానాపూర్ గ్రామంలో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన ఎరుకలి నాగరాజు ఇంట్లో అక్రమంగా రేషన్ బియ్యం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పోలీసులు తనిఖీ చేసి, 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ దాదాపు రూ. 37 వేలు ఉంటుందని ఎస్ఐ తెలిపారు. సివిల్ సప్లయ్ అధికారి వేణుగోపాల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యంతో ఎస్ఐ కల్యాణ్‌కుమార్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఉచిత ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నాం

● వైద్యాధికారి అనూష



ధన్వాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉచిత వైద్య సేవలతో పాటు, అవసరమైన మందులను ఉచితంగా అందిస్తు ఆరోగ్య విషయాలపై అవగాహన కల్పిస్తున్నామని వైద్యాధికారి అనూష తెలిపారు. సోమవారం ఆమె 'ఆంధ్రజ్యోతి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు.

మండలంలో నిర్వహించిన ఉచిత ఆరోగ్య శిబిరాల్లో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులను ఎంత మందిని గుర్తించారు?

బీపీకి సంబంధించి 541 మంది, షుగర్‌కు సంబంధించి 450 మంది వ్యాధిగ్రస్తులను గుర్తించాం. వారందరికి పీహెచ్‌సీలో ఉచితంగా మందులు అందిస్తున్నాం.

ఆసుపత్రిలో కుక్కకాటు మందు ఉందా, ఇప్పటికి ఎంతమందికి అందించారు?

కుక్క కాటు మందు అందుబాటులో ఉంది. 103 మందికి కుక్క కాటు టీకాలు ఇచ్చాం.

క్షయ వ్యాధి క్యాంపులు నిర్వహించారా?

క్షయ(టీబీ) వ్యాధి క్యాంపులు నిర్వహించి, 149 మందికి పరీక్షలు చేశాం. ఇందులో ఐదు గురిని గుర్తించి ఆరు నెలల చికిత్సలు అందిస్తు, మందులు ఇచ్చాం.

పేట యార్డులో ధాన్యం క్రయ విక్రయాలు

నారాయణపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట వ్యవసాయ మార్కెట్ యార్డుకు సోమవారం ధాన్యం విక్రయానికి వచ్చింది. వివిధ రకాల ధాన్యం ధరలు క్వింటాల్‌కు ఈ విధంగా ఉన్నాయి.

సరుకు	కనిష్ఠం	గరిష్ఠం
ఎర్ర కందులు	10,756	7,888
తెల్ల కందులు	10,901	8,555
వడ్లు సోన	2,669	1,080
వడ్లు హంస	1,800	1,800
అలసందలు	7,525	7,525

న్యూస్ బాక్స్

ఇందిరమ్మ మహిళాశక్తి పథకం కింద అర్హులకు ఉచిత కుట్టుమిషన్లు

నారాయణపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మైనార్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అర్హులైన వారికి ఇందిరమ్మ మహిళాశక్తి పథకం కింద ఉచిత కుట్టుమిషన్లు అందించనున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రషీద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి జిరాక్స్ సెట్‌ను స్థానిక కార్యాలయంలో అందించాలని తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, గుర్తింపు పొందిన సంస్థ నుంచి టైలరింగ్ శిక్షణ తీసుకున్న వారు అర్హులన్నారు. వివరాలకు స్థానిక కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

కోస్గి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో దోహదపడుతుందని కాంగ్రెస్ పార్టీ కోస్గి మండల అధ్యక్షుడు రఘువరన్ రెడ్డి అన్నారు. మండలంలోని ముశ్రీపా గ్రామానికి చెందిన తిరుమలప్ప కుమారుడు అనారోగ్యానికి గురి కాగా సీఎంఆర్ఎఫ్‌ను దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన రూ.రెండు లక్షలను సోమవారం రఘువరన్ రెడ్డి బాధిత కుటుంబానికి అందించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిప్రసాద్ రెడ్డి, నాయకులు మహిపాల్‌రెడ్డి, శ్రీనివాసరావు తదితరులున్నారు.

చిన్నారులకు పలకలు, నోట్‌బుక్స్ పంపిణీ

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో 40 మంది చిన్నారులకు జనతా గ్యారేజ్ వాట్సాప్ గ్రూప్ తరఫున సోమవారం పలకలు, నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రామ్, లక్ష్మీ ఆటోమొబైల్స్ బాలాజీ ఎక్స్‌పోటిలు మాట్లాడారు. కార్యక్రమంలో రహమాన్ తదితరులున్నారు.

మాజీ సర్పంచుల అరెస్టు

కృష్ణ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు గాను బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సర్పంచులు తలపెట్టిన చలో హైదరాబాద్‌ను పోలీసులు అడ్డుకున్నారు. కృష్ణ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వై.శివప్పతో పాటు తిప్పయ్య, రమేశ్, నరసింహరెడ్డి తదితరులను పోలీసులు సోమవారం అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు.

ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలి

దామరగిద్ద, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టాదారు పాసు పుస్తకం ఉన్న ప్రతీ రైతుకు రుణమాఫీ చేయాలని సీపీఎం నాయకుడు జోషి అన్నారు. రుణమాఫీ అమలు కోరుతూ సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో రైతులతో కలిసి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ రుణమాఫీ చేశామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం ఇంకా 40 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. వెంటనే రైతులందరికి రుణమాఫీ చేయాలని, లేకపోతే సీపీఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులతో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. రైతులు భీంషప్ప, కనకప్ప, తిప్పన, మొగులప్ప, దుర్గప్ప తదితరులున్నారు.

కళాశాలలో తాగునీటి ఎద్దడి

- పనిచేయని నీటి శుద్ధి యంత్రం
- విద్యార్థులకు తప్పని నీటి తిప్పలు
- పట్టించుకోని అధికారులు

ధన్వాడ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ధన్వాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాగునీటి ఎద్దడి నెలకొంది. దీంతో విద్యార్థులకు నీటి తిప్పలు మొదలయ్యాయి. కొన్నినెలల నుంచి నీటిశుద్ధి యంత్రం పనిచేయకపోవడంతో అధ్యాపకులతో పాటు, విద్యార్థులు సైతం తాగునీటిని ఇంటి నుంచి తెచ్చుకునే పరిస్థితి ఏర్పడింది. కొన్ని నెలల నుంచి ఇదే పరిస్థితి ఉన్నప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదు. నీటి శుద్ధి యంత్రం మరమ్మతు గురించి ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం పలుమార్లు అధికారులు, పాలకులకు విన్నవించినా వారు పెడచెవిని పెడుతూ వచ్చారు. దీంతో కళాశాలతో నీటి కొరత మొదలైంది. ఎవరైనా ఇంటి నుంచి నీరు తెచ్చుకోలేదంటే మరొకరిపై ఆధారపడడమో లేదంటే బయటకు వెళ్లడమో జరుగుతోంది. కళాశాలలో దాదాపు 200 మందికి పైగా విద్యార్థులతో పాటు, అధ్యాపకులు 16 మందికి పైగా ఉన్నారు. ఇంతమందికి మంచినీళ్ల కావాలంటే నీటి శుద్ధి యంత్రం తప్పనిసరి. అయితే మరమ్మతుకు గురైన దీని గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి శుద్ధి యంత్రానికి మరమ్మతులు చేయించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరమ్మతుకు నోచుకోని నీటి శుద్ధి యంత్రం

ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా చేపట్టాలి

- కలెక్టర్ సిక్తా పట్నాయక్
- జాజాపూర్ గ్రామం ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పరిశీలన

నారాయణపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పారదర్శకంగా, పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. సోమవారం నారాయణపేట మండలం జాజాపూర్ గ్రామంలోని ఎస్సీ కాలనీలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను కలెక్టర్ పరిశీలించి, మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా సర్వే కొనసాగుతోందని ప్రతీరోజు సర్వే నివేదికలు ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా పంపిస్తున్నామన్నారు. ప్రభుత్వం సూచించిన ప్రకారం కచ్చితమైన సమాచారం క్షేత్ర స్థాయిలో సేకరించాలని సిబ్బందికి సూచించారు. ఎస్సీ కాలనీలోని రెండు నివాసాల వద్ద ఇందిరమ్మ ఇళ్ల సర్వేను యాప్ ద్వారా కలెక్టర్ పరిశీలించారు. ఎంపీడీవో సుదర్శన్, ఈడీఎం విజయ్, పంచాయతీ అధికారులు ఉన్నారు.



జాజాపూర్ గ్రామ ఎస్సీ కాలనీలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

సీఎం కప్ పోటీలు ప్రారంభం

నారాయణపేట టౌన్ : సీఎం కప్ జిల్లా స్థాయి పోటీలను కలెక్టర్ సిక్తా పట్నాయక్ సోమవారం ప్రారంభించారు. పేట మినీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో కలెక్టర్ సరస్వతి మాత, ధ్యాన్‌చంద్ చిత్రపటాలకు పూజలు చేశారు. అనంతరం 11 మండలాల నుంచి వచ్చిన క్రీడాకారుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబర్చిన వారిని రాష్ట్ర స్థాయికి పంపిస్తామని, క్రీడలపరంగా నారాయణపేటకు ప్రత్యేక గుర్తింపు ఉందని గుర్తు చేశారు. ఆ తర్వాత కోస్గి-ఊట్కూరు బాలికలు, నారాయణపేట రూరల్-దామరగిద్ద బాలుర జట్ల మధ్య వాలీబాల్ పోటీలను కలెక్టర్ ప్రారంభించారు. వాలీబాల్ ఫైనల్‌లో ఊట్కూరు-మద్దూరు క్రీడాకారులు తలపడగా మద్దూరు బాలుర జట్టు మొదటి బహుమతి గెలుపొందారు. అలాగే బాలికల విభాగంలో కోస్గి మొదటి బహుమతి, మరికల్ జట్టు రెండవ బహుమతి సొంతం చేసుకున్నారు. డీఈవో గోవిందరాజులు, ఏఎంవో విద్యాసాగర్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్, మార్కెట్ చైర్మన్ సదాశివారెడ్డి, డీవైఎస్‌వో వెంకటేష్, డీపీఆర్వో రషీద్, మక్తల్ మునిసిపల్ కమిషనర్ భోగేశ్వర్, పేట వైస్ చైర్మన్ హరినారాయణ్‌భట్టడ్, పీఈటీలు పాల్గొన్నారు.

ఘనంగా అంజన్న రథోత్సవం

మక్తల్ రూరల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మక్తల్ మండలం ఉప్పరపల్లి గ్రామంలోని రాజమూరి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రథోత్సవాన్ని సోమవారం తెల్లవారుజామున ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తి విగ్రహాన్ని రథం వద్దకు తీసుకొచ్చి, పూజలు చేశారు. అనంతరం భక్తజన సందోహం మధ్య స్వామివారిని రథంపై ఉంచి, రథాన్ని లాగారు. భక్తులు దాసంగాలు సమర్పించి మొక్కులు, తీర్చుకున్నారు. అంతకుముందు స్వామివారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పూజారులు శ్యామ్‌సుందర్‌జోషి, డీవీ.చారి, గ్రామస్థులు అంజనేయులు, అంజప్ప, సురేష్, లింగారెడ్డి, నరసింహరెడ్డి, దామోదర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

బిజ్వార్‌లో...

ఊట్కూర్ : పడమటి అంజన్నస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా మండలంలోని బిజ్వార్ గ్రామంలో సోమవారం అంజన్నస్వామికి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో భజన మండలి ఆధ్వర్యంలో చెక్కభజన, కోలాటం, అడుగుల భజన నిర్వహించారు. రామనామ జపంతో ఆలయ ప్రాంగణమంతా మారుమోగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నరసింహాచారి, రవికుమార్ జోషి, వేణుగోపాల్ జోషి, నాగరాజ్‌జోషి, ఆలయ కమిటీ అధ్యక్షుడు దొరొల్ల కృష్ణయ్య, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

గున్ముక్లలో...

ధన్వాడ : ధన్వాడ మండలం గున్ముక్ల గ్రామంలో కడపరాయ రథోత్సవం అంగరంగ వైభవంగా కొనసాగింది. సోమవారం తెల్లవారుజామున గోవింద నామస్మరణ మధ్య భక్తులు రథాన్ని ముందుకు లాగారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డితో పాటు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.



మక్తల్ మండలం ఉప్పరపల్లి రాజమూరి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాల్లో రథాన్ని లాగుతున్న భక్తులు

ప్రజా ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి : ఎస్పీ

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలని సంబంధిత పోలీస్ అధికారులకు ఎస్పీ యోగేష్‌గౌతమ్ సూచించారు. సోమవారం నారాయణపేట ఎస్పీ కార్యాలయంలో ప్రజావాణి దరఖాస్తులను ఆయన స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఏడు మంది ఫిర్యాదుదారులతో ఎస్పీ నేరుగా మాట్లాడారు. బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని సీఐ, ఎస్సైలను ఆదేశించారు. భూతగాదాలు కోర్టు ద్వారానే పరిష్కరించుకోవాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడాలని, ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజల సమస్యల పరిష్కారానికి పోలీస్‌శాఖ నిరంతరాయంగా పనిచేస్తుందన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100, 1930కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు.



ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మాగనూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మాగనూరు ఎంపీడీవో రహమతుద్దీన్ సిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల మొబైల్ యాప్ ద్వారా సర్వేను ఎంపీడీవో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే చేస్తున్న కుటుంబ సభ్యుల వద్ద సమాచారం సేకరించాలని, ఎలాంటి పొరపాటు చేయొద్దని సూచించారు. పంచాయతీ కార్యదర్శి తిమ్మప్ప, రెవెన్యూ జూనియర్ అసిస్టెంట్ ఫరీద్ తదితరులున్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

నారాయణపేట న్యూటౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ ఎండీ.సలీం అన్నారు. సోమవారం నారాయణపేట ఏడవ వార్డు అశోక్‌నగర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈనెలాఖరు లోపు సర్వే పూర్తయిన తర్వాత ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కృతనిశ్చయంతో ఉన్నారన్నారు. యాప్‌లో వార్డు ఆఫీసర్ లబ్ధిదారుల వివరాలు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎండీ.ఖుద్దూస్, ప్రదీప్, ఎండీ.తఖీ తదితరులున్నారు.

అనుమతుల పేరిట ఇసుక అక్రమ రవాణా

కొత్తపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో అనుమతుల పేరిట అక్రమ ఇసుక దందా కొనసాగుతోంది. అభివృద్ధి పనుల పేరుతో ఇసుక అనుమతులు తీసుకొని ప్రైవేటు వ్యక్తులకు అడ్డగోలుగా అమ్ముకుంటున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రాత్రివేళల్లో ఈ అక్రమ దందాకు తెర తీస్తున్నారని కొందరు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇసుక అక్రమ తరలింపు అధికారులకు తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు.



తిమ్మారెడ్డిపల్లి గ్రామంలో అక్రమంగా తరలుతున్న ఇసుక

చలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలి

మాగనూరు, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.అంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే విడుదల చేయాలని, జీవో నెంబర్ 51ను సవరించి, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, కారోబార్, బిల్ కలెక్టర్లకు ప్రత్యేక హోదా ఇవ్వాలని, కార్మికులను రెండవ పీఆర్సీ పరిధిలోకి తీసుకువచ్చి కనీస వేతనం రూ.18వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు పాల్గొనాలని ఆయన కోరారు.

'బస్సు యాత్రను జయప్రదం చేయాలి'

ఊట్కూర్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ భద్రత, కనీస వేతనం అమలు చేయాలని కోరుతూ డిసెంబరు 15 నుంచి 31 వరకు రాష్ట్ర వ్యాప్తంగా జరిగే బస్సు యాత్రలో ఆశాలు పాల్గొని జయప్రదం చేయాలని ఆశా వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి సాబేరాబేగం పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని నిడుగుర్తి గ్రామంలో బస్సు యాత్ర వాల్‌పోస్టర్లను ఆమె విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బస్సు యాత్ర డిసెంబరు 22న నారాయణపేటకు చేరుకుంటుందని, ఆశాలందరూ వచ్చి బస్సు యాత్రకు స్వాగతం పలకాలని కోరారు. వర్కర్లు మంజుల, కార్మిక సంఘాల నాయకులు శంకర్, అంజప్ప, రాజు ఉన్నారు.

డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రికి వినతి

మక్తల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): మక్తల్, ఆత్మకూర్ పట్టణాల్లో డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహకు ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి వినతి పత్రం అందించారు. మక్తల్ పరిసర ప్రాంతాల్లో మూత్రపిండాల వ్యాధి బాధితులు స్థానికంగా డయాలసిస్ కేంద్రం లేకపోవడంతో దూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేయించుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు తెలిపారు. స్పందించిన మంత్రి డయాలసిస్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.



మంత్రి దామోదర రాజ నర్సింహకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలి

- జీసీడీవో పద్మనళిని
- కృష్ణ, మాగనూరు మండల కేంద్రాల్లో కేజీబీవీల తనిఖీ

మాగనూరు/కృష్ణ, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చదువుతున్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనాన్ని ఇవ్వాలని జీసీడీవో పద్మనళిని అన్నారు. సోమవారం మాగనూరు మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో బియ్యాన్ని, కూరగాయలను, వంటకాలకు వాడే మంచినూనె ఇతర వస్తువులను పరిశీలించారు. స్టోర్‌రూమ్‌ను శుభ్రంగా ఉంచుకోవాలని, కుళ్లిపోయిన కూరగాయలతో వంటలు వండొద్దని, ఎక్కడా ఎవరికి ఏ లోటు లేకుండా విద్యార్థులకు న్యాయమైన భోజనాన్ని అందించాలని, విద్యార్థులకు మంచినీటి సమస్య లేకుండా చూడాలని ఎస్‌వో రాధికకు సూచించారు. అనంతరం విద్యా సామర్థ్యాన్ని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట ఎంఈవో అనిల్‌గౌడ్ తదితరులున్నారు.

అదేవిధంగా, కృష్ణ మండలం హిందూపురం గ్రామ శివారులోని కస్తూర్బా ఇంగ్లిష్ మీడియం బాలికల పాఠశాలను జీసీడీవో పద్మనళిని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నాన్ టీచింగ్ ఉపాధ్యాయులు, విద్యార్థినులతో మాట్లాడారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ఎంఈవో నిజాముద్దీన్ తదితరులున్నారు.



మాగనూరు కేజీబీవీలో బియ్యాన్ని పరిశీలిస్తున్న జీసీడీవో పద్మనళిని

కొనసాగుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మె



చెవిలో పూలు పెట్టుకొని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

నారాయణపేట టౌన్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారంతో పాటు, రెగ్యులరైజ్ తదితర డిమాండ్లతో సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన సమ్మె సోమవారం ఐదవ రోజుకు చేరింది. మునిసిపల్ పార్కు వద్ద చేపట్టిన సమ్మెలో ఉద్యోగులు చెవిలో పూలు పెట్టుకొని ప్రభుత్వానికి తమ నిరసనను తెలిపారు. సమగ్ర శిక్ష మహిళా ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు, ఆరోగ్య, జీవిత భీమా, పదవీ విరమణ బెనిఫిట్స్ కింద రూ.25లక్షలను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉద్యోగులు ఎల్లాగౌడ్, గౌరమ్మ, అల్తాఫ్, అన్వర్, రాజు, మనోహర్, నవీన్, యుగంధర్, అనిత, రవి, నరేష్ తదితరులున్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

మక్తల్, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న రాష్ట్రంలోని 20వేల మంది ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు నాగార్జున ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మక్తల్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరంతర పోరాటాల ద్వారానే ఉద్యోగుల సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఎన్నికల తర్వాత అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు ఉద్యోగుల సమస్యలను విస్మరిస్తున్నాయని విమర్శించారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకు తమ సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు. సమావేశంలో తపస్ మండల అధ్యక్షుడు డి.రవీందర్ ప్రధాన కార్యదర్శి రాకేష్ ఉన్నారు.

ఆర్టీసీ జాతీయ క్రీడల తృతీయ విజేత తెలంగాణ

- పరుగుపందెంలో సత్తా చాటిన డిపో కానిస్టేబుల్



పేట ఆర్టీసీ డిపో కానిస్టేబుల్ ఖాజాసల్మాన్‌ను అభినందిస్తున్న డీఎం లావణ్య, ఉద్యోగులు

నారాయణపేట, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ జాతీయ క్రీడల తృతీయ విజేతగా నిలిచిన ఎండీ.ఖాజా సల్మాన్‌ను సోమవారం నారాయణపేట డిపోలో డిపో మేనేజర్ లావణ్య శాలువాతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం కైలాసగిరి పోలీస్ క్రీడా మైదానంలో ఈనెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగిన అఖిల భారత ఆర్టీసీ రోడ్డు రవాణా సంస్థ ఉద్యోగ క్రీడా పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి ఉద్యోగులు హాజరయ్యారు. 13 క్రీడా అంశాల్లో పోటీలు జరిగాయి. పరుగుపందెం పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు తృతీయ స్థానంలో నిలిచింది. నారాయణపేట ఆర్టీసీ డిపోకు చెందిన కానిస్టేబుల్ ఎండీ.ఖాజాసల్మాన్‌తో పాటు వివిధ డిపోలకు చెందిన ఉద్యోగులు మురళీకృష్ణ, కార్తీక్, తిరుపతిలు ప్రతిభ కనబర్చారు. పరుగుపందెం పోటీల్లో పేట డిపోను తృతీయ స్థానంలో నిలిపి తెలంగాణ ఆర్టీసీకి పేరు తీసుకువచ్చిన సల్మాన్‌ను డీఎంతో పాటు, ఉద్యోగులు అభినందించారు.

ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన



భూనీడులో ప్రారంభానికి నోచుకోని పల్లె దవాఖాన

కొత్తపల్లి, డిసెంబరు 16 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో భూనీడులో నిర్మించిన పల్లె దవాఖాన ప్రారంభానికి నోచుకోవడం లేదు. కొత్త ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తయినా ప్రారంభానికి నోచుకోకపోవడం వింతగా ఉందని ఆ గ్రామ ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని భూనీడు గ్రామంలో ఉన్న పాత దవాఖానలో గది చిన్నగా ఉండడం.. ఆసుపత్రికి ఔషధాలు వస్తే పెట్టుకోవడానికి స్థలం లేదు. రోగులకు చికిత్స చేయడానికి ఉన్న ఒక్క గది ఇరుకుగా ఉండడంతో గత ప్రభుత్వం కొత్తగా దవాఖానను నిర్మించింది. దవాఖానకు వచ్చిన రోగులకు కనీసం కూర్చోవడానికి కుర్చీలు లేవు. కుర్చీలు లేకపోవడంతో ముఖ్యంగా గర్భిణులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్తగా నిర్మించిన పల్లె దవాఖానను వెంటనే ప్రారంభించాలని గ్రామస్థులు కోరుతున్నారు.